క్లుప్తంగా

మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల: పట్టణంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. పార్టీ నాయకులు అనూప్‌రావు, చీటి వెంకట్రావ్, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మైనార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఫయీం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, ఆడెపు మధు, కౌన్సిలర్లు సత్యం, సాబీర్, రఫీ, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రాజనాల మధుకుమార్ మాట్లాడుతూ గ్రామస్తులు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గరిపెల్లి శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ నరేంద్ర, హెచ్‌ఈవో శ్రీనివాస్, వైద్య సిబ్బంది హేమలత, ప్రశాంత, ప్రతిమ, నాయకులు గోపిరాజరెడ్డి, తలారి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

వెల్గటూర్: ఎండపల్లి మండలం కొత్తపేట స్టేజీ వద్ద మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏటా వేసవికాలంలో నిర్వహించే చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వెల్గటూర్ ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ బి.సుధారాణి చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం జీరెడ్డి మహేందర్‌రెడ్డి సహకారంతో స్థానిక క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించారు. సర్పంచ్‌లు కొమ్ము రాంబాబు, మారం జలేందర్‌రెడ్డి, గెల్లు శేఖర్, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు రియాజ్, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల కొత్తగా రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మించామని, గ్రామం నుంచి దేవాలయం వరకు విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయించాలని విన్నవించినట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

వారంరోజులు సాగునీరు విడుదల చేయాలి

కోరుట్ల: శ్రీరాంసాగర్ కెనాల్ నీరు మరో వారంపాటు విడుదల చేయాలని మోహన్‌రావుపేట సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కాలువ నీళ్లపై ఆధారపడి కొందరు రైతులు ఆలస్యంగా వరినాట్లు వేశారని ఆ పొలాలు పూర్తిస్థాయిలో పండేందుకు వారం పట్టే అవకాశం ఉన్నందున కెనాల్ నీళ్లు మరో వారం పాటు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



కనకరాజును సన్మానిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో కొమురంభీమ్ విగ్రహ ఆవిష్కరణకు హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజును గురువారం తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు గుర్రాల రవీందర్ సన్మానించారు. నాయకులు ఆత్రం రవీందర్, సీడెం భీం, కేంద్రం మారుతి, సోయం విక్రమ్ ఉన్నారు.

వైద్యులు అందుబాటులో లేరు

- విధుల్లో డీజీవో ఒక్కరే
- మెట్‌పెల్లికి డిప్యుటేషన్‌పై వెళ్లిన డాక్టర్ హరిత
- రాయికల్ వైద్యవిధాన పరిషత్‌లో తగ్గుతున్న ప్రసవాల సంఖ్య



రాయికల్ ఆసుపత్రిలో బోసిపోయిన గర్భిణులు, బాలింతల వార్డు

రాయికల్: ప్రజలు, గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం రాయికల్ వైద్యవిధాన పరిషత్ ఏర్పాటు చేసింది. అయితే అందులో డీజీవోగా ఒడ్నాల రజిత ఒకరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందడం లేదు. ఉన్న ఒక్క డీజీవో సెలవులోకి వెళ్తే ఇక ఆసుపత్రిలో ప్రసవాలు లేనట్లే. దీంతో రాయికల్ వైద్య విధాన పరిషత్‌లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. అయినప్పటికీ వైద్య విధాన పరిషత్ అధికారులు దృష్టిసారించడం లేదు.

విధుల్లో ఒక్కరే డాక్టర్..

పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో నిరుపేదలకు 24గంటలు వైద్యసేవలు అందించేందుకు రాయికల్ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవి, డీజీవోగా డాక్టర్ రజిత, ఈఎన్‌టీగా డాక్టర్ రమేశ్, రేడియాలజిస్ట్‌గా డాక్టర్ సురేందర్, చాతి వైద్య నిపుణులుగా డాక్టర్ వాణి, చిన్నపిల్లల వైద్య నిపుణులుగా డాక్టర్ హర్షిత, కంటి వైద్య నిపుణులుగా డాక్టర్ తేజస్విని, స్త్రీవైద్య నిపుణులుగా డాక్టర్ హరిత విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ హరిత 25రోజుల క్రితం మెట్‌పెల్లి ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై వెళ్లింది. దీంతో డాక్టర్ ఒడ్నాల రజిత మాత్రమే గర్భిణులకు, బాలింతలకు వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ 40–50 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేయడంతో పాటు గర్భిణులకు ఇతర పరీక్షలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న ఒక్క మహిళా డాక్టర్‌పై పనిభారం పడింది.

తగ్గుతున్న ప్రసవాలు..

రాయికల్ వైద్యవిధాన పరిషత్‌లో మహిళా డాక్టర్ ఒక్కరే ఉండడంతో గర్భిణులు, బాలింతలు ప్రైవేట్ ఆసుపత్రి వైపు మొగ్గు చూపుతున్నారు. కేవలం ఒకే డాక్టర్ ఉండడంతో ఫిబ్రవరిలో 15, మార్చిలో 15, ఏప్రిల్‌లో నేటి వరకు 3 మాత్రమే ప్రసవాలు జరిగాయి. ఇప్పటికైనా వైద్యవిధాన పరిషత్ అధికారులు స్పందించి రాయికల్ ఆసుపత్రికి మరొక డీజీవోను కేటాయిస్తే ప్రసవాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వైద్యులు, ఆశా కార్యకర్తలు పేర్కొంటున్నారు.

మరో డాక్టర్‌ను నియమించాలి



రాయికల్ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించేందుందుకు ప్రభుత్వం మరొక డాక్టర్‌ను నియమించాలి. వైద్యసేవల కోసం వెళ్తే వైద్యులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మరో వైద్యురాలిని నియమించాలి. – మ్యాకల అనురాధ, కౌన్సిలర్

అధికారులకు నివేదించాం



రాయికల్ ఆసుపత్రిలో మహిళా డాక్టర్ ఒక్కరే ఉన్నమాట వాస్తవమే. దీంతో ఉన్న డాక్టర్‌పై కొంత వరకు పనిభారం ఎక్కువ అవుతోంది. మరొక డాక్టర్‌ను నియమించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. – రవి, సూపరింటెండెంట్

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మూటపెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కొత్తపేట, మూటపెల్లి గ్రామాల్లో గురువారం 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పలు వార్డులను సందర్శిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూటపెల్లి, కొత్తపేట గ్రామాలకు చెందిన ఏడుగురికి కల్యాణలక్ష్మి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం జగన్నాథ్‌పూర్ గ్రామంలో గిరిజన ఆరాధ్యదైవం కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్‌లు బెక్కం తిరుపతి, రాజేశం, ఆత్రం విజయ, ఎంపీటీసీలు శ్రీనివాస్, కవిత, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

జగిత్యాలటౌన్: మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు రంజాన్ ఉపవాస దీక్షల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ముస్లిం కమ్యూనిటీ హాల్ ఖిలాగడ్డలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో భాగంగా ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. అనంతరం ఇఫ్తార్, తాం(డిన్నర్) కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎంపీపీ, చైర్మన్

జగిత్యాలరూరల్: ఆలయంలోని విలువైన సంపదను కాపాడడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తుల రక్షణ కోసం ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జగిత్యాలరూరల్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, పొలస్తేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మర్రిపల్లి కొండల్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పొలాస గ్రామంలోని పొలస్తేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం వారు ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు కోతుల బెడద లేకుండా ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అలారం సిస్టంతోపాటు సుమారు రూ.1.30లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆలయ ఈవో వేణుగోపాల్, వైస్‌చైర్మన్ రంగు రాజయ్య, ధర్మకర్తలు గుండేటి బేబీరాణి రాజు, పుట్ట నాగరాజు, జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్నం కిషన్‌రెడ్డి, భారతపు భూమయ్య, షేర్ల మహేశ్, గంగరాజం, గడ్డి చిన్న మల్లయ్య, తార నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినం



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ఐక్యోపాధ్యాయ సంఘం తొమ్మిదో ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పతాకం ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ మాట్లాడుతూ ఎన్నో ఉపాధ్యాయ ఉద్యమాలు, కరోనా లాంటి పరిస్థితులతోపాటు ఆర్టీసీ సమ్మెకు కూడా తమ సంఘం అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సిరిపురం శ్రీనివాస్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, మాసం చిరంజీవి, మధుసూదన్, శ్యామకోర శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్ కొండ్రు అనిల్ పాల్గొన్నారు.

'మా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లండి'



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కథలాపూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మండలంలోని జేపీఎస్‌లు గురువారం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయినందున తమను రెగ్యులరైజేషన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలో పనిచేస్తున్న 15మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

16న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

మల్యాల: మండలంలోని నూకపల్లి మోడల్‌స్కూల్‌లో చేరే విద్యార్థులకు 16న నూకపల్లి మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సరితాదేవి తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కథలాపూర్: మండలకేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్ తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు.

✦బతికపల్లిలో ఉచిత దంత వైద్యశిబిరం

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో గురువారం జగిత్యాలకు చెందిన సృజన దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 200 మందిని డాక్టర్ సృజన పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సమస్య వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. సర్పంచి శోభారాణి, ఎంపీటీసీ లచ్చయ్య, వార్డుసభ్యులు చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

✦అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

పెగడపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ నరేశ్ ఒక ప్రకటలో కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

✦నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ధర్మపురి మండల అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగుల కాంతయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి పురుషోత్తం, ఉపాధ్యక్షుడు పులి చంద్రయ్య, కార్యదర్శులుగా పులి ప్రేమిత్, సత్యనారాయణ, ముడిమడుగు శంకర్, ప్రచార కార్యదర్శి దేవి అంజి, సాంస్కృతిక కార్యదర్శి దాసరి చంద్రశేఖర్, కోశాధికారి గంజాయిల గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నాయకులు నరేశ్, తరాల కార్తీక్, మెడపట్ల దుబ్బయ్య పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులు ఉపయోగించుకోవాలి



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కమిషనర్ అయాజ్

కోరుట్లటౌన్: ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని దుర్గ స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో సంఘ సభ్యులందరికీ జ్యూట్ బ్యాగులను మున్సిపల్ కమిషనర్ అయాజ్, వార్డు కౌన్సిలర్ మొలుమూరి అలేఖ్య గురువారం పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడటం మానేయాలని మహిళలకు సూచించారు. మెప్మా టీఎంసీ సంధ్య, సీవో శివకుమార్ పాల్గొన్నారు.

మన ఊరు–మనబడి గొప్ప కార్యక్రమం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మనబడి గొప్ప కార్యక్రమం అని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య–అనిల్, కౌన్సిలర్లు బద్దిసుజాత–మురళి, సత్యం, ఎంఈవో నరేశం, డీఈ గోపాల్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాశిరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మాదాపూర్ గ్రామంలో మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నూతన తరగతి గదులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం మనఊరు మనబడికి శ్రీకారం చుట్టి పాఠశాలలను ఆధునీకరిస్తోందన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం..

మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని వేంకటేశ్వర ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కటుకం రాజేశ్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని పాలకవర్గాన్ని అభినందించారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య–రాజేశ్, ఎంఈవో గంగుల నరేశం, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ అంబేడ్కర్

కోరుట్లరూరల్: నేటి తరానికి బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని మోహన్‌రావుపేటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, మాజీ జెడ్పీచైర్మన్ తుల ఉమ, బీజేపీ నాయకుడు నవీన్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి

మెట్‌పల్లి: మహిళా సంఘాల అభ్యున్నతికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయ సమీపంలో రూ.75లక్షలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన టీఎంసీ రాజయ్యకు ఎమ్మెల్యే నివాళి అర్పించారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

మెట్‌పల్లి: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో వినోద్‌కుమార్ అగ్నిమాపక సిబ్బందిని దేశించారు. ఈ మేరకు అగ్ని ప్రమాద వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి మల్లికార్జున్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులే కీలకం



సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులే కీలకం అని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయినందున వారిని సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పల్లె ప్రగతి నుంచి పారిశుధ్యం వరకు పంచాయతీ కార్యదర్శుల చొరవతోనే గ్రామాలు పచ్చదనంతో పరిశుభ్రంగా కనబడుతున్నాయని కొనియాడారు. మండలంలోని మూడు గ్రామాలకు ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు రావడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, నాయకులు జాజాల జగన్‌రావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, టైపిస్ట్ నాగరాణి, మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

17న మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారులు

మెట్‌పల్లి: మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు 17న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు రాజ్‌మహమ్మద్, మగ్గిడి వెంకటనర్సయ్య, వడ్డెపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. 13 నుంచి 14వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 15న నామినేషన్ల పరిశీలన, అదే రోజు ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. 17న ఎన్నికలు జరిపి అదేరోజు ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. మొదటిరోజు పలు పదవులకు పలువురు న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మపురి: వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన 69 మంది బాధితులకు రూ.21.46 లక్షల విలువ గల చెక్కులను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు మొగిలి శేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెగడపల్లి మండలంలో..

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. మద్దులపల్లిలో ఏడుగురికి రూ.2.56లక్షలు, పెగడపల్లిలో 8మందికి రూ.1.81లక్షలు, సుద్దపల్లిలో 8మందికి రూ.1.50లక్షలు, లింగాపూర్‌లో ఐదుగురికి రూ.74వేలు, ఎల్లాపూర్‌లో నలుగురికి 90వేలు, ఆరవెల్లిలో 1.32 లక్షలు, వెంగళాయిపేటలో నలుగురికి రూ.2.80లక్షలు, రాములపల్లిలో ముగ్గురికి రూ.89వేల విలువ గల చెక్కులను అందజేశారు.

గంభీర్‌పూర్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో సర్పంచ్ దంపతులు పోతు సింధూజ–శేఖర్ ఆధ్వర్యంలో ముస్లింలకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.